క్లుప్తంగా

డీటీ బాధ్యతల స్వీకరణ

పాకాల: డిప్యూటీ తహసీల్దార్‌గా మోహన్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాళహస్తి నుంచి బదిలీపై పాకాలకు వచ్చారు. ఇక్కడ డీటీగా విధులు నిర్వహిస్తున్న హనుమంతరావు తిరుపతి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో డీటీ పరదేశి, జూనియర్ అసిస్టెంట్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల, ఐతేపల్లి, ఏజీపల్లి, పులిత్తివారిపల్లి, కొటాల, పుల్లయ్యగారిపల్లి, బందార్లపల్లి, రామిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వైద్య శిబిరాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుంటే ముందస్తు జాగ్రత్తలతో రోగాల నుంచి బయట పడవచ్చన్నారు.

వృద్ధులకు అన్నదానం



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నవజీవన్ ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ సేవలందిస్తోందన్నారు. కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో బెల్లకొండ సురేష్, రామారావు పాల్గొన్నారు.

స్విమ్స్ భోజనశాలలో జేఈవో తనిఖీ

తిరుపతి తుడా: స్విమ్స్‌లో వైద్య విద్య, పారా మెడికల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు అందిస్తున్న ఉచిత భోజనం నాణ్యతను జేఈవో సదా భార్గవి శుక్రవారం పరిశీలించారు. అధికారులతో కలిసి భోజనశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించి రుచి, నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. వంటశాల, భోజన శాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బంది, విద్యార్థులకు సూచించారు. డిప్యూటీ ఈవో గోవింద రాజన్, క్యాటరింగ్ విభాగం ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున పాత్రధారి శివున్ని ప్రార్థిస్తూ తపస్మాన్‌ను అధిరోహించాడు. అక్కడి నుంచి పూలు, పండ్లు విసిరాడు. వాటిని చేజిక్కించుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. ఉభయదాతలుగా ముద్దుకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం ఆలయంలోని ద్రౌపది సమేత ధర్మరాజులు మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు, పాండవుల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

మూలస్థానమ్మకు ఘనంగా పొంగళ్లు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మకు శుక్రవారం మల్లయ్యపల్లి వాసులు ఘనంగా పొంగళ్లు పెట్టారు. వారు గ్రామం నుంచి మూలస్థానమ్మ ఆలయం వరకు కాలినడకన వచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పెద్ద ఎత్తున గ్రామస్తులు మూలస్థానమ్మకు విశేష పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లూరి విజయ, లక్ష్మీపతి, సూరి, వెంకటయ్య, విష్ణు, తనూజ్, భాను, ఈశ్వరయ్య, గోపి పాల్గొన్నారు.

23 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం.. తదితర నేరాలకు పాల్పడిన 23 మందికి రూ.11,800 జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు తీర్పునిచ్చారు. శుక్రవారం తిరుమల క్యాంప్‌కోర్టులో ఆయన వివిధ కేసులను విచారించారు. నలుగురికి రూ.8వేలు, మరో 19 మందికి రూ.3,800 జరిమానా విధించారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు

- తిరుపతిలోని సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు
- ఉచితంగా 11 రకాల సేవలు
- నేటి నుంచి అవగాహన కల్పించనున్న సచివాలయ సిబ్బంది



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

సర్వీసు చార్జీలు లేకుండా అందజేసే సేవలు ఇవే..

- కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- బర్త్, డెత్ సర్టిఫికెట్లు
- భూ కొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు
- భూ వివరాల నమోదులో మార్పులు, చేర్పులు
- వివాహ ధ్రువీకరణ పత్రం
- ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్
- ఆధార్ అప్‌డేట్
- కౌలు గుర్తింపు కార్డులు
- కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డు విభజన
- ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ సభ్యుల్లో కొంతమంది సభ్యుల పేర్ల తొలగింపు

తిరుపతి తుడా: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో ముందడుగు వేశారు. సాంకేతిక కారణాలు, సకాలంలో వివిధ ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేక కొంతమంది అర్హులు సంక్షేమ పథకాలను అందుకోలేక పోతున్నారన్న విషయాన్ని గుర్తించారు. వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సర్వీస్ చార్జీలు లేకుండానే అందించడంతోపాటు సాంకేతిక సమస్యలను పరిష్కరించి పథకాలను అక్కడికక్కడే మంజూరు చేయించడమే లక్ష్యంగా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జూలై ఒకటో తేదీ నుంచి వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలుచేయాలని ఆదేశించారు. సచివాలయాల వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమం నాలుగు వారాల పాటు కొనసాగుతుంది. క్లస్టర్ల వారీగా నిర్దేశించిన తేదీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

నేటి నుంచి ఇంటింటికీ ..

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు శనివారం నుంచి సచివాలయ సెక్రటరీలు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వార్డు వలంటీర్లు గ్రూపులుగా ఇంటింటికీ వెళ్లనున్నారు. ఏవైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందకుండా పోవడం లేదా, ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయా? అని ఆరాతీసి అవసరం ఉన్న వారికి జగనన్న సురక్షలో పరిష్కరించేలా అవగాహన కల్పించనున్నారు.

సద్వినియోగం చేసుకోండి

ప్రజలకు స్థానికంగా, వేగంగా, ఉచితంగా సేవలను అందించాలన్న ఉన్నతాశయంతో ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలుచేస్తోంది. నిర్దేశించిన 11 సేవలను ప్రజలు ఉచితంగా పొందవచ్చు. వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందుకోలేని అర్హులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు వేదిక కానుంది. నగర ప్రజలు సేవలు, ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–డి.హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

జగనన్న సురక్ష షెడ్యూల్ ఇలా

జగనన్న సురక్షను జూలై 1 నుంచి తిరుపతిలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. 102 వార్డు సచివాలయాలను 37 క్లస్టర్లుగా విభజించారు. వీటి నిర్వహణ కోసం మూడు టీమ్‌లను ఏర్పాటుచేశారు. రోజుకు క్లస్టర్ల వారీ రెండు నుంచి మూడు ప్రాంతాల్లో జగనన్న సురక్షను నిర్వహిస్తారు.

తేదీ	సెక్రటేరియెట్ క్లస్టర్
1వ తేదీ	ఎన్‌జీవో కాలనీ, అంబేద్కర్ నగర్ -01
	అంబేద్కర్ కాలనీ -02, 03
	శాంతినగర్-01, 02, మధురానగర్ 15, 16
4వ తేదీ	దొడ్డాపురం వీధి-01,02
	మధురానగర్-03,04,05,06
6వ తేదీ	ఐఎస్ మహల్ రోడ్డు -01,02,03,04
	మధురానగర్ -13,14,17,18
	జర్నలిస్ట్ కాలనీ-01,02
7వ తేదీ	ఎల్‌బీ నగర్-01,02,
	శ్రీకృష్ణా నగర్ -01,02
	చెన్నారెడ్డి కాలనీ - 01,02
11వ తేదీ	బైరాగిపట్టెడ - 01,02,03,04
	ఎమ్మార్‌పల్లి - 01, 02
	ఎల్‌ఐసీ రోడ్డు -01,02,03
13వ తేదీ	బైరాగిపట్టెడ -05,06,07,08
	న్యూమారుతీనగర్ - 01,02
	నెహ్రూ స్ట్రీట్ - 01, 02
15వ తేదీ	పోస్టల్ కాలనీ -01,02,03,04
	ప్రకాశం రోడ్డు -01,02,03,04
	పట్నాలు వీధి -01,02
18వ తేదీ	ప్రకాశం రోడ్డు -05,06
	రాజీవ్‌నగర్, జీవకోన - 01,02,03
	రాజీవ్‌నగర్, జీవకోన - 04,05,06,07,08
20వ తేదీ	రేణిగుంట రోడ్డు -01,02
	ఆర్‌సీ రోడ్డు -01,02
	సరోజినీ దేవి రోడ్డు - 01,02
22వ తేదీ	తిరుమల రెడ్డి నగర్ - 01,02,03
	తిరుమల బైపాస్ రోడ్డు 01,02
25వ తేదీ	తాతానగర్ -01,02,03
	ఇందిరానగర్ -01,02
	చెన్నారెడ్డి కాలనీ -03,04
27వ తేదీ	కొత్తపల్లి - 01,02
	కెన్నడీనగర్ - 01,02,03
	శంకర్ కాలనీ -01,02
28వ తేదీ	మధురానగర్ -01,02
	మధురానగర్-07,08

ఎన్ని పార్టీలు కలిసినా గెలుపు జగనన్నదే



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి

- ప్రతిపక్ష పార్టీలన్నీ గాలిలో దీపాలే
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: రాబోయే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసొచ్చినా గెలుపు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మేయర్ శిరీష, కార్పొరేటర్ వి.ఈశ్వరి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్‌తో కలిసి తిరుపతి 21వ డివిజన్ ఎస్వీనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాలు, లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబమూ రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి పొందినట్టు తెలిపారు. తాము ఏ గడపకు వెళ్లినా ప్రజలు హారతులతో బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలే తమను తిరిగి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ గాలిలో దీపాలేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆరణి సంధ్య, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, అనీల్, నాగరాజు, మనోహర్‌రెడ్డి, జీవన్, వెంకటేష్, ధనశేఖర్, ఉదయగిరి రమేష్, నాదముని, కంకనాల రమేష్, శేఖర్‌రాయల్, శ్యామల పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సబ్‌స్టేషన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతిలోని చింతల చేను రవీంద్ర నగర్, ఉపాధ్యాయ నగర్, మున్సిపల్ ప్రకాశం పార్క్, ఎంఆర్ పల్లి మారుతి నగర్ ప్రాంతాల్లో రూ.18.20 కోట్లతో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేశారు. వాటిని శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నగర వాసులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు రూ.18.20 కోట్లతో నాలుగు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందనడానికి ఇదొక నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు దక్కుతుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలంతా మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, విద్యుత్ శాఖ ఈఈలు వాసుదేవరెడ్డి, మహేశ్వరరెడ్డి, అమరబాబు, డీఈలు మునిప్రసాద్, భాస్కర్‌నాయుడు, ఏఈలు హరిప్రసాద్, బాలాజీ, కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్‌కుమార్, మునిరామిరెడ్డి, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, పడమటి కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు హర్షిత్‌రెడ్డి పరామర్శ



మునికృష్ణను పరామర్శిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కొటాల పంచాయతీ సర్పంచ్ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు మునికృష్ణ ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనకు మోకాలి ఆపరేషన్ చేశారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి శుక్రవారం కొటాల గ్రామానికి చేరుకుని మునికృష్ణను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ దక్షిణ మండల అధ్యక్షుడు దేవారెడ్డి, చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు మధుమురళి నాయుడు, అశ్విని, రమేష్‌రెడ్డి, హరి, సోమశేఖర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, నరసింహారావు, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

విద్యాసామగ్రి వితరణ



రామచంద్రాపురం: మండలంలోని కట్టకింద వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కోదండ రామానాయుడు విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకుని డాక్టరుగా అమెరికాలో స్థిరపడినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలయ్య, హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంపై టీడీపీ, కమ్యూనిస్టుల పార్టీల విమర్శలు దారుణం

తిరుపతి కల్చరల్: స్వార్థ రాజకీయ లబ్ధికోసం ఆరాట పడుతున్న టీడీపీతో కలిసి కమ్యూనిస్టు పార్టీల నేతలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత వ్యతిరేక పార్టీ టీడీపీతో కలిసి కమ్యూనిస్టు నేతలు మాట్లాడుతూ సీఎం జగన్‌ను దళిత వ్యతిరేకి అని విమర్శడం వారి స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో దళితులపై దాడులు చేసిన టీడీపీతో కమ్యూనిస్టు నేతలు జతకట్టడం సిగ్గుచేటని తెలిపారు. దళితుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ వారి సంక్షేమానికి బాటలు వేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి విమర్శలు మానుకోవాలని, లేకుంటే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

భక్తులకు అన్నదానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలో వెలసిన మూలస్థానమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజలు చేశారు. ఆలయంలో అష్ట దేవతలు, వినాయకుడికి, బాల సుబ్రహ్మణ్యం స్వామికి, నవగ్రహాలకు, నాగాలమ్మ దేవతకు విశేష పూజలు చేశారు. 96 మంది మద్యం ప్రియులు అమ్మవారి ఎదుట మద్యం ముట్టమని సత్యప్రమాణాలు చేశారు. మధ్యాహ్నం చంద్రగిరి రాఘవేంద్ర బేకరి యాజమాని ఈశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. వారిని ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా ధూమ్రవారాహి దేవి పూజ



విశేషాలంకరణలో శ్వేత వారాహి అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ధూమ్రవారాహీ దేవి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకులు సిద్ధేశ్వరానంద భారతిస్వామి, మాతాజీ రమ్యానంద భారతి పీఠంలో కొలువైన శ్వేత వారాహి అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య పూజలు చేశారు. అమ్మవారిని ధూమ్రవారాహి దేవిగా అలంకరించారు. వేదపండితులు ధూమ్రవారాహి దేవి దేవి మంత్రాలతో హోమం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

తిరుపతి గాంధీ రోడ్: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని శుక్రవారం తిరుపతిలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోవిందరాజు స్వామి ఆలయం సమీపంలోని ఓ ప్రైవేట్ లాడ్జి ముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తొండం నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, కవిత పాల్గొన్నారు.

వీనులవిందు చేసిన సంధ్య, వరలక్ష్మి గానం



కళాకారులను సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాయంత్రం కళాకారులు జీఎం.సంధ్య, టి.వరలక్ష్మి చేసిన గానం భక్తులకు వీనుల విందు చేసింది. రోజువారి కార్యక్రమంలో భాగంగా కర్నూలుకు చెందిన కళాకారులు, టీటీడీ మాజీ ఆస్థాన గాయకుడు బి.రఘునాథ్ శిష్యులు జీఎం.సంధ్య, పి.వరలక్ష్మి సంగీత కచేరి నిర్వహించారు. వీరికి కీ బోర్డుపై బాలాజీ, తబలాపై దేవశర్మ సహకారం అందించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులను శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీపీ కో ఆర్డినేటర్ కోకిల, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేపీఎస్.రాజా, కళాకారులు బొందు రామచంద్రారెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి మంగళం: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం 14వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ మహేష్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి

- పోలీసు పరేడ్ గ్రౌండ్ పక్కన మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రతిపాదన
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి



మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటుపై పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగర దశను మార్చేలా రూ.వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులన్నీ డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అలానే ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్ పక్కన రాస్ బిల్డింగ్ మీదుగా ఎయిర్ బైపాస్ రోడ్డును కలిపే మాస్టర్ ప్లాన్ రోడ్డును తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి స్మార్ట్ సిటీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి సుమారు రూ.1,800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్‌లో సుమారు రూ.42 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం పొందినట్టు వివరించారు. 50 డివిజన్లలో తాగునీరు, సీసీ, బీటీ రోడ్లు, యూడీఎస్ వంటి వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. రోడ్ల అభివృద్ధితో తిరుపతి రూపురేఖలు మారడంతో పాటు సుమారు 5 వేల ఎకరాల్లో నగరం విస్తరిస్తుందన్నారు. తిరుపతి నగరానికి కనెక్టివిటీ పెరగడం, నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది అన్నారు. 40 ఏళ్ల కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు కలను నెరవేర్చామన్నారు. అలానే గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు. రాబోవు రోజుల్లో ఇంతకు పది రెట్లు అభివృద్ధిని నగర ప్రజలు చూస్తారని వివరించారు.

పద్మావతీ అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



తిరుచానూరు వద్ద జడ్జి జస్టిస్ జ్యోతిర్మయి

తిరుచానూరు(చంద్రగిరి)/శ్రీకాళహస్తి: రాష్ట్ర హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి శుక్రవారం కుటుంబ సమేతంగా తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని, శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయాల వద్దకు చేరుకున్న ఆమెకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు ఎస్ఐ వెంకటసుబ్బయ్య, శ్రీకాళహస్తి ఈవో సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ కటాక్షం



తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారి దేవేరి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులో వెలసిన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై విహరించి భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శ్రీకృష్ణ ముఖ మండపం వద్ద కొలువుదీర్చి కనుల పండువగా కల్యాణోత్సవం చేశారు. తిరిగి సాయంత్రం అమ్మవారికి ఆలయ అలంకరణ మండపంలో విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం శ్రీవారి దేవేరి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, వాహన ఇన్‌స్పెక్టర్ భాస్కర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటు



ఒలింపిక్ రన్‌లో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్/తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 29న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ప్రతిష్ఠంచనున్నట్లు తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ తెలిపారు. అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా శుక్రవారం శ్రీనివాస్ స్పోర్ట్ కాంప్లెక్స్ నుంచి టౌన్ క్లబ్ సర్కిల్ వరకు ఒలింపిక్ రన్ చేపట్టారు. సెంట్రల్ జీఎస్టీ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఏజే.ప్రసాద్, డాలర్స్ గ్రూప్స్ చైర్మన్ దివాకర్‌రెడ్డి, డాక్టర్ రామచంద్ర జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. వై.ప్రవీణ్ మాట్లాడుతూ ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సుమారు 25 క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో చీఫ్ కోచ్ సయ్యద్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, కిరణ్, శివప్రసాద్, రత్నాకర్, విజయ్‌కుమార్, రెడ్డెప్ప, సత్యనారాయణ, హాకీ కోచ్ మాలిని, చక్రవర్తి, హిందూజా, ప్రేమ్‌నాథ్, వినోద్, గోపి, వంశీ, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, పద్మావతి బాలికల పాఠశాల, మాలవ్యాజి మున్సిపల్ హైస్కూల్, ఎస్వీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్లకు వినతి

తిరుపతి మంగళం : ఈ నెల 29న బక్రీద్ పండుగ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో ఏర్పాట్లు చేయాలని ఈద్గా కమిటీ సభ్యులు కోరారు. వారు శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణకు వినతి పత్రాలు సమర్పించారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ ఎస్.కె. బాబు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఇమామ్ సాహెబ్ మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా ఈద్గా మైదానంలో సుమారు 20 వేల మందికి పైగా ముస్లింలు నమాజ్ చేస్తారని తెలిపారు. తాగునీటి సదుపాయంతోపాటు షామియానా తదితరాలు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఇమ్రాన్ బాషా, సలీమ్ బాషా, మహ్మద్ రఫీ, రహంతుల్లా, షాదీ మహల్ చైర్మన్ గఫూర్ తదతరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తిరుపతిలో ప్రజలను భాగస్వాములు చేయండి



అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు దిశానిర్దేశం చేస్తున్న ఇండోర్ కమిషనర్ హర్షితా సింగ్

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతిలో ప్రజలను భాగస్వాములను చేయాలని ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హర్షితా సింగ్ పేర్కొన్నారు. ఇండోర్ నగరంలో అమలవుతున్న స్వచ్ఛత, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్వహణను అధ్యయనం చేసేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పారిశుద్ధ్య, యూడీఎస్ కార్మికులు 80 మందితో కూడిన బృందం మంగళవారం వెళ్లింది. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో ఇండోర్ నగరం వరుసగా ఏడు పర్యాయాలు అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈక్రమంలో తిరుపతిలో మెరుగైన స్వచ్ఛతను అమలుచేసేందుకు అధికారులు కొంత మందిని క్షేత్రస్థాయి అవగాహన కోసం ఇండోర్‌కు పంపించారు. రెండు రోజులుగా ఇండోర్‌లో పర్యటించిన సిబ్బంది అక్కడ అమలుచేస్తున్న స్వచ్ఛ విధానాలను తెలుసుకున్నారు. చెత్త నిర్వహణ, సేకరణ, సెగ్రిగేషన్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇండోర్ కమిషనర్ హర్షితాసింగ్‌తో ప్రత్యేకంగా సమావేశమైనట్లు చెప్పారు. ఆమె మాట్లాడుతూ క్లీన్ తిరుపతి కోసం తమ విధి విధానాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజలను మరింతగా భాగస్వామ్యం చేస్తేనే స్వచ్ఛ తిరుపతి సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డీఈఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.